



# ఇప్పటి కథల్లో తాత్వీక కోణం లేదు

**- కేతు విశ్వనాథరెడ్డి**

అధ్యాపకుడిగా వృత్తిని కొనసాగించినా ప్రవృత్తి అయిన సాహిత్యంలో నాలుగు కథా సంపుటాలు, రెండు నవలలు, ఐదు వ్యాసాల సంపుటాలు వెలువరించి ఎన్నో పుస్తకాల ప్రచురణకు సంపాదకులుగా వ్యవహరించిన కేతు విశ్వనాథరెడ్డి గారిని ఇంటర్వ్యూ చేయమని నవ్య వీక్లి ఎడిటర్ చెప్పారు. ఈ నేపథ్యంలో దాదాపు నెలరోజుల తర్వాత ఓ రోజు సాయంత్రం హైదరాబాదులోని మధురానగర్‌లో ఉన్న కేతు విశ్వనాథరెడ్డి గారి ఇంటికి వెళ్లాను. అక్కడినుంచి ఇద్దరం మాట్లాడుకుంటూ దగ్గర్లోనే ఉన్న కృష్ణకాంత్ పార్క్‌కు వచ్చాం. అక్కడ ఒక బెంచీ పైన కూర్చున్నాం.

చుట్టూ పచ్చగా చెట్లు. కింద పచ్చిక. ఆరోజు ఆదివారం కావడంతో రంగురంగుల దుస్తుల్లో పిల్లల కేరింతలు. పెద్దలు కూడా పిల్లలైపోయి వారితో ఆడుకుంటున్నారు. ఇంతలో ఎడిటర్ జగన్నాథశర్మగారు వచ్చారు. మెల్లిగా విశ్వనాథరెడ్డిగారిని మాటల్లోకి దింపాము. ఎంతటి గొప్ప వ్యక్తులకైనా బాల్యం ఓ మధురానుభూతి. అది తరగని గని. కేతు విశ్వనాథరెడ్డిగారు తన బాల్యంలోకి, ఉద్యోగ జీవితంలోకి, సాహితీ పయనంలోకి వెళ్లిపోయారు...

### జ్యోతిష్యానికి నాకు చుక్కెదురు..

మాది కడప జిల్లా కమలాపురం తాలూకా, రంగసాయి పురం అనే కుగ్రామం. మాది సుమారుగా యాభైమంది ఉండే సమష్టి సంపన్న కుంటుంబం. భూ వసతితో పాటు రెండు ఫ్యాక్టరీలలో పెద్ద భాగస్వామ్యం ఉండేది. మానాన్న వెంకటరెడ్డి. ఆయన చిలమకూరు ఫ్యాక్టరీ వ్యవహారాలు చూసుకునేవారు. మానాన్న కో-ఆపరేటివ్‌లో కొంతకాలం ఉద్యోగం చేశారు. నేను జూలై 10, 1939 ఆషాఢ బహుళ అష్టమి నాడు పుట్టాను. మా ఇంట్లో నేనే పెద్దవాడిని. నా తర్వాత తమ్ముడు, చెల్లి. నా జాతకం రాయించాలని మానాన్న కోరిక. మానాన్న సహోద్యోగిగా ఓ బ్రాహ్మణ మిత్రుడు ఉండేవాడు. ఆయన జ్యోతిషంలో మంచిదిట్ట. ఆయనను తీసుకుని ఎర్రగుంట్లనుంచి మానాన్న, తాత ట్రెయిన్‌లో ఇంటర్‌క్లాస్‌లో మా ఊరికి ప్రయాణిస్తున్నారు. అదే బోగీలో తమిళులు ఉన్నారు. వాళ్లకు మా వాళ్లకు ఘర్షణ జరిగింది. వారిలో ఒకతను మానాన్న గొంతు పట్టుకున్నాడు. దీంతో మాతాత చెయిన్‌లాగి ట్రెయిన్‌ను ఫ్యాక్టరీ వద్ద ఆపాడు. 'రండిరా' అంటూ కేకేశాడో లేదో మా వాళ్లంతా వచ్చేశారు. ఆరోజు అర్ధరాత్రి వరకూ ఆ పంచాయితీ జరిగింది. ఆ గొడవలో నా జాతకం రాయడం మరచిపోయారు. దాంతో నాకు జాతకం లేకుండాపోయింది.



భార్య, కొడుకు, కోడలు, మనుమరాలుతో...

### అధ్యాపకుడు చేసిన అన్యాయం..

నేను చిన్నప్పటినుంచీ బడికి సరిగా వెళ్ళేవాణ్ని కాదు. మంచి అధ్యాపకులుంటే వెళ్ళేవాణ్ని. కొట్టే అధ్యాపకులున్నా, సరిగా పాఠం చెప్పని అధ్యాపకులున్నా బడి ఎగ్గొట్టేవాణ్ని. పిల్లల్ని వెంటేసుకుని చెట్లూ, చేలూ, కొండలూ గుట్టలంట తిరిగేవాణ్ణి. ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల వయస్సులోనే ఏడోతరగతి పరీక్షలు రాశాను. అయితే అప్పటికి నా వయసు సరిపోదని మా టీచర్ తిమ్మప్పనాయుడు నా పుట్టిన సంవత్సరం 1939 అయితే దానిని 1937గా రికార్డుల్లో రాశాడు. దాంతో నేను రెండు సంవత్సరాల ముందే రిటైర్ కావలసి వచ్చింది.

### కొట్టం కాల్చేశాం..!

మా వూర్లో సమష్టి కుటుంబంలో అంతగా కట్టడి లేదని, సరైన సావాసాలు అబ్బడం లేదని, నాకు చదువు సరిగా రావడం లేదని నన్ను ఎర్రగుంట్లలోని మా మేనమామ ఇంటికి పంపించేశారు. అక్కడ మా పెద్దతాత ఉండేవాడు. మా ఫ్యాక్టరీలో పని చేస్తూ దళిత క్రైస్తవులు, వైశ్యులు, రజకులు...చాలా కులాల వారు ఉండే వారు. నేను వాళ్ల పిల్లలతో ఎక్కువ చనువుగా ఉండేవాడిని. నాకేమో వేరుశనగ కాయలు తిందామని ఆశ. మనం ఫ్యాక్టరీ పెట్టుకుని వేరుశనగ కాయలు తినడం ఏమిటి అనేది మా నాన్నమ్మ. అప్పటికీ రహస్యంగా డ్రైవర్ బాయిలర్లోని బొగ్గుల మధ్యన కొన్ని వేరుశనగ కాయలు వేసి కాల్చి ఇచ్చేవాడు. ఫ్యాక్టరీలో పనిచేసే ఒకావిడ మా స్థలంలో కొట్టం కట్టుకుంది. అప్పట్లోనే కొత్తగా మూడు విత్తనాల వేరుశనగ కాయలు వచ్చాయి. వాటిని తిందామని ఆశ. ఆమె ఇంట్లో లేని సమయంలో శనక్కాయలు తీసుకుని మిత్రులతో కలసి ఆ కొట్టంలోకి పోయాను. అగ్గిపెట్టె కూడా సంపాదించాం. చూరుకింద కూర్చుని పుల్లలు వేసి మంటవేసాం. ఇంకేముంది. కాసేపట్లోనే నిప్పంటుకుంది. కొట్టం కాలిపోయింది. స్థలం మాదే అయినా కొట్టం వేరే వాళ్లది కదా. మా తాత వాళ్ళకు ఐదు వందల రూపాయలు ఇచ్చాడు.

### ఎప్పుడూ అప్పు చేయొద్దు..

అప్పుడు నేను నాలుగో తరగతి అనుకుంటా. మా తాత రోజూ నాకు పావలా ఇచ్చేవాడు. ఒకసారి మా బడి దగ్గరకు చక్రం లాటరీ వచ్చింది. పిల్లలందరం దాని దగ్గరికి పరుగుదీశాం. నేనూ పందెం కాశా. నా పావలా పోయింది. అయితే అక్కడినుంచి రాబుద్ధికాలా. మా వూరబ్బాయి మల్లికార్జున శెట్టిని పావలా అప్పు అడిగా. పెద్దరెడ్డి మనవడిని. అడిగితే ఇవ్వడా?. ఇచ్చాడు. అయితే ఆ పావలా కూడా పోయింది. మా తాత గాంధేయవాది. ఆయనకు ఖద్దరు కండెల ఏజెన్సీ ఉండేది. వాటికి సంబంధించిన బిల్లులు నేను రాసేవాడిని. అప్పుడు మాతాత నాకు అర్ధరూపాయి ఇచ్చేవాడు. అలా ఇచ్చినప్పుడు మల్లికార్జున శెట్టి పావలా ఇచ్చేద్దామని అనుకున్నా. అయితే వాడు ఒకరోజు మా ఇంటికి వచ్చి అందరి ముందూ 'నా పావలా నాకీ' అంటూ గట్టిగా అడిగాడు. అది విన్న మాతాత నన్ను గట్టిగా అరిచాడు. జీవితంలో ఎప్పుడూ ఎక్కడా అప్పు చేయద్దన్నాడు. 'సరే' అన్నాను కాని తర్వాత జీవితంలో చాలా అప్పులు చేయాల్సివచ్చింది.

### గాడిదనెక్కాను...

నాకు రజకుల పిల్లలతో బాగా స్నేహం ఉండేది. తరచూ వాళ్ల ఇళ్లల్లో తినేవాణ్ణి కూడా. ఇది మా జేజమ్మ యల్లమ్మకు ఇష్టం ఉండేది కాదు. కుటుంబ గౌరవం పాడు చేసే పని చేయకూడదనేది. రజకుల ఇంట ఒక గాడిద ఉండేది. నాకు దాన్ని ఎక్కాలని సరదా. ఒక రోజు కళ్లం దగ్గర గాడిద ఉంది. యిటూ అటూ ఇళ్లున్నాయి. నాకు మనుషులు ఎవ్వరూ కనపళ్లా. ధైర్యం చేసి గాడిదను ఎక్కేశా. అయితే అది వెంటనే కింద పడేసేసింది. దాన్ని మా జేజమ్మ చూసేసింది. గట్టిగట్టిగా అరిచింది. ఇలా...నా బాల్యమంతా ఒకరకంగా నిష్పూచిగా సాగింది.

### కంచుకంఠం..

ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష చేపట్టాడు. మా వూర్లో నాగన్న అని ఎస్ఎఫ్ఐ లీడర్ ఉండేవాడు. ఆయన ఆధ్వర్యంలో స్కూలు పిల్లలందరం స్కూలు ఎగ్గొట్టి, దీక్షల్లో పాల్గొన్నాం. తర్వాత ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. టంగుటూరి ప్రకాశం పంతులు సభ కర్నూలులో ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు నుంచి అక్కడికి పోవాలంటే నాలుగు రూపాయలు కావాలి. నా దగ్గర లేవు. నారాయణరెడ్డి అనే స్నేహితుడి డబ్బుతో వెళ్లి ప్రకాశం పంతులుగారి ప్రసంగం విన్నాను. కంచుకంఠంతో ఆయన మాట్లాడ్డం ఇంకా బాగా గుర్తే.

### కోపంలో విశ్వామిత్రుడినే..

చిన్నప్పటినుంచీ నేను చాలా కోపిష్టిని. నేను శ్రీకాళహస్తిలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నప్పుడు బి.ఎ.లో ఒక రాజకీయ నాయకుడి కొడుకు ఉండేవాడు. వాడు అమ్మాయిలను బాగా అల్లరి పెట్టేవాడు. ఒకరోజు వాడిని క్లాసులోనే పట్టుకుని వాయించేశాను. అయితే తర్వాత వాడు మా ఇంటికొచ్చి మా ఆవిడతో 'అమ్మా.. సార్ కొడితే కొట్టారు.. అమ్మాయిల ముందు కొట్టద్దని చెప్పండి' అన్నాడు. కందుకూరులో పనిచేస్తున్నప్పుడు ఒక రౌడీ స్టూడెంటు ఉండేవాడు. వాడు అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేసేవాడు. వాడిని క్లాసులోంచి బరబరా బయటకు లాక్కొచ్చి బాదే

శాను. నాకేమవుతుందో అని మా ప్రిన్సిపాల్ కృష్ణస్వామి భయపడ్డాడు. 'చాలా ఏళ్ల క్రితమే ఇలా ఎవరైనా బుద్ధి చెప్పి ఉంటే ఇలా అయ్యేవాడిని కాదు కదా' అన్నాడట ఆ స్టూడెంటు. సైన్సు పాఠాలు విన్నట్టుగానే తెలుగు పాఠాలు కూడా వినాలి. లేదంటే నాకు చాలా కోపం.

*వీడేరా అంతా చేసింది..*

తిరుపతిలోని ఎస్వీ యూనివర్శిటీకి రామశర్మగారు వి.సి. గా ఉన్న రోజుల్లో నేను అక్కడ అధ్యాపకుడిగా పనిచేశాను. కడప సెంటర్‌లో పి.జి. పరీక్షలు జరుగుతున్నాయి. నన్ను అబ్జర్వర్‌గా పంపారు. అది విపరీతమయిన కాపీ సెంటర్. కాపీలు కొట్టేప్పుడు పట్టుకోకుండా అసలు స్టూడెంట్‌ల వద్ద కాపీలు లేకుండా చూడమని చెప్పాను. మొదటి రోజు చాలా స్ట్రిక్ట్‌గా ఉన్నాం. మూడోరోజు ఒకడు కాపీకొడుతుంటే లెక్చరర్ పట్టుకుని బయటకు పంపాడు. లెక్చరర్లు అందరూ భయపడుతున్నారు. నేనున్నానని ధైర్యం చెప్పాను. స్టూడెంట్లు ఏదైనా గొడవ చేస్తే కడప సెంటర్ క్యాన్సిల్ చేసి తిరుపతికి మార్పిస్తానని చెప్పాను. తర్వాత చెప్పినట్టుగానే సెంటర్‌ను తిరుపతికి మార్చాము. పరీక్షలు మొదలయ్యాయి. ఇక్కడా అబ్జర్వర్‌ను నేనే. స్ట్రిక్టుగా ఉన్నాం. నేను వరండాలో ఉన్నాను. ఒకడు ముందుగానే పరీక్ష రాసేసి బయటకు పోతున్నాడు. పోతూ పోతూ నన్ను చూసి 'వీడేరా అంతా చేసింది' అన్నాడు కోపంగా. నవ్వుకున్నాను.

*లండన్‌లో డబ్బు విలువ తెలిసింది*

1962లో ఉద్యోగంలో చేరినప్పటికీ 1967దాకా నాన్న డబ్బు పంపించేవాడు. నాకు మొట్టమొదటి సారిగా 1985లో డబ్బుపైన గౌరవం ఏర్పడింది. అప్పుడు లండన్ వెళ్లాను. అక్కడ ఒక్క దోసె 2.99 సెంట్లు(77 రూపాయలు) అన్నప్పుడు యింత విలువ ఉందా డబ్బుకు అనుకున్నాను.

## నచ్చినవి

**కథకుడు :** గురజాడ
**కవి :** శ్రీశ్రీ
**పాట :** పరుగులు తీయాలి... గిత్తలు ఉరకలు వేయాలి.... (మల్లీశ్వరి)
**సినిమా :** బంగారుపాప
**హీరోలు :** సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, నాగార్జున
**హీరోయిన్ :** త్రిష
**కథ :** దేశంలో దేవకన్యలు(రారా)
**నవల :** వారసత్వం(కొడవటిగంటి కుటుంబరావు)
**వ్యక్తి :** ముని జేజి యల్లమ్మ
**వంట :** సంగటి, మాంసం, జొన్నరొట్టెలు
**గాయని :** భానుమతి
**గాయకుడు :** ఘంటసాల, బాలు

*డబ్బు మీద వ్యామోహం లేదు..*

నాది ప్లాన్డ్ జీవితం కాదు. నాకు, పద్మావతికి ఆగస్టు 24, 1962లో పెళ్లయింది. మా దాంపత్యం సాఫీగానే సాగిపోయింది. నాకు మొదటినుంచీ ఆర్థిక విషయాల పట్ల శ్రద్ధాసక్తులు లేవు. డబ్బుమీద వ్యామోహం లేదు. పద్మ చాలా క్రమశిక్షణగల మనిషి. ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు. నా అదృష్టం కొద్దీ పిల్లలకు లేనిపోని దర్జాలు గిర్జాలు నేనూ, ఆమె అలవాటు చేయలేదు. నాకూ చేతకాదు. వాళ్లకూ లేదు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అబ్బాయి, చిన్నమ్మాయి అమెరికాలో ఉంటున్నారు. పెద్దమ్మాయి వాళ్లు గోవాలో ఉంటున్నారు. రచనల పరంగా నా శ్రీమతి పద్మ సహకారం చాలా ఎక్కువ. ఒక్కోసారి పిల్లలు, తను విసుక్కునే వారేకాని చాలామటుకు నేను సీరియస్‌గా రాసుకుంటూ కూర్చుంటే నన్ను డిస్ట్రబ్ చేసేవారు కాదు.

*మొదటి కథ 'అమ్మ'*


1958నుంచీ వ్యాసాలు రాయడం మొదలుపెట్టాను. అవి నేను ఇంటర్ చదివే రోజులు. తెలుగు స్వతంత్రలో నా వ్యాసాలు వచ్చాయి. అప్పట్లోనే కథ కూడా రాశాను కానీ అచ్చుకు పంపలేదు. కడప రేడియో కేంద్రంద్వారా 1958లో నాది 'అమ్మ' అనే కథ ప్రసారమయింది. అదే నా మొదటి కథ.

*వారసత్వం..*

నాకు ఒక అబ్బాయి. ఇద్దరు అమ్మాయిలు.. చదువుకునే రోజుల్లో మా అబ్బాయి నాలుగు కథలు రాశాడు. వాడు ఇంజనీరింగ్‌లో చేరాక కథలు రాయడం మానేశాడు. మా పిల్లలు అందరూ సాహిత్యం బాగా చదువుతారు. అయితే మా మనుమరాలు డ్రాయింగ్‌లో ఇప్పటికే అంతర్జాతీయ పోటీల్లో బహుమతులు గెల్చుకుంది. మనవడు ఇంగ్లీషులో వ్యాసాలు రాస్తున్నాడు. వాడు సైన్స్ వద్దని ఆర్ట్స్ చదువుతున్నాడు.

*ఫిబ్రవరి 5న ప్రళయం వస్తుంది..*

చదువు అయిపోయింది. 'ఆంధ్రరత్న' పత్రికలో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగం వచ్చింది. ఫిబ్రవరి 9, 1962న హైదరాబాదుకు పోయి ఉద్యోగంలో చేరాలి. అయితే వజీర్ రహ్మాన్ అప్పటికే నాకో ఉత్తరం రాశాడు 'ఫిబ్రవరి 5న ప్రళయం వస్తుంది' అని. దాదాపు నాకు తెలిసిన సాహితీ మిత్రులందరిలో ఇదే చర్చ. చాలామంది దీన్ని నమ్మారు కూడా. నేను మాత్రం దీన్ని పట్టించుకోలేదు. ప్రళయం వస్తుందన్న రోజునే ఉద్యోగంలో చేరడానికి బస్సెక్కాను. డ్రోణాచలంలో దిగి అక్కడినుంచి రైల్లో వెళ్లాను. కాచిగూడా రైల్వేస్టేషన్‌లోకి ఇండియాటుడే రాజేంద్ర వచ్చి నన్ను తన రూముకు తీసుకుపోయాడు. 9న ఉద్యోగంలో చేరాను. అంటే ప్రళయంలో ఉద్యోగం.



హరిపురుషోత్తమరావు, చేరాతో.

*ఉద్యమాల్లో పైపై ప్రేరణలే..*

జీవితంలో బహుముఖ కోణాలు పెరిగిపోయాయి. భిన్న ప్రాంతాలు, కులాలు, మతాల్లోని అనేక పార్శ్వాలు గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా కథల్లో వస్తున్నాయి. తాత్వికంగా మన రచయితలు ఎదుగుతున్నారా? అనేది రచయితలు ఆలోచించాల్సి ఉంది. ఇప్పటి కథల్లో తాత్విక కోణం, జీవిత దర్శనం లోపించింది. అయితే మిగతా భారతీయ భాషలతో పోలిస్తే మనవాళ్లు బాగా రాస్తున్నారు. దీనికి తోడు ఇక్కడి ఉద్యమాలు పైపై ప్రేరణలనే యిచ్చాయి. లో చూపు యువ్వలేకపోతున్నాయి, గ్రహించలేకపోతున్నాయి. రచయితలు యిప్పటి 'ధనప్రస్థానం'లోని వైరుధ్యాలను పట్టుకున్నారా? మనం తెలుసుకోవాల్సింది, చూడాల్సింది చాలా ఉంది.

*తీరని కల..*

మాది ఉమ్మడి కుటుంబమని చెప్పాను కదా.. అప్పట్లో 60 ఎకరాల పొలం ఉండేది. మా భాగంగా 30 ఎకరాలు వచ్చింది. అదీ అమ్ముకున్నాం. పల్లెటూల్లో పర్ణశాలలో ఉంటూ, ప్రశాంతంగా సేద్యం చేసుకుంటూ ఉండాలనేది నా తీరని కల. నేను నగర బందీని. అందువలన కల కలగానే మిగిలిపోయింది.

**-సుంకోజి దేవేంద్రాచారి**

నాకు నచ్చిన నా కథ

# దాపుడు కోక

- కేతు విశ్వనాథరెడ్డి

**"అయ్యో, నాయనా! నా కోక! దాపుడుకోక!"**
**పద్దెనిమిదేళ్ళ పల్లెటూరు చెన్నమ్మ సీట్లోంచి దిగ్గునలేస్తూ అరిచింది. వుట్టిపాటుగా ఆవేశంగా, ఆందోళనతో అరిచింది. చెన్నమ్మ అందమైంది కాదు. కాబట్టి దిగ్గున లేవడంలో హొయలు లేవు. వొళ్లో పైట మరుగున పాలు తాగుతూన్న పసివాడు తల్లి వుట్టిపాటు కదిరిపడి కెవ్వుమన్నాడు. పైట జారిపోయింది. వీడిపోయిన రవికలోంచి, పసివాడి నోట్లోంచి తప్పిపోయిన రొమ్ములు కన్పిస్తున్నాయి. వొళ్లోంచీ జారిపోతూ కెవ్వుమంటూన్న బిడ్డను సందిట్లోకి యెగదోసుకుంది.**

"నాయనా! నా కోక! దాపుడు కోక!"

చెన్నమ్మ జాలిగా ఆర్తనాదం చేసింది. చెన్నమ్మ నాగరిక నాయిక కాదు కాబట్టి ఆమె ఆర్తనాదంలో విపంచీ కలస్వనాలు పలకలేదు. బస్సు యింజను రొదలో ప్రయాణీకుల రణగొణ ధ్వనుల్లో, చెన్నమ్మ గోడు యెవరికీ అర్థం కాలేదు. కాని చెన్నమ్మ వులికిపాటు చూచి కొందరు గొల్లుమన్నారు. చెన్నమ్మ తీరుతెన్నుల్లో కొందరు సెక్సును చూస్తున్నారు. కండక్టరు ద్రోణుడు సృష్టించిన పద్మ వ్యూహంలో చిక్కుకొని వొక మూల నలిగిపోతున్న వీరయ్య, ఆ అరిచింది తన కూతురని గుర్తించాడు. యేమరుస్తున్నదో సరిగా వినిపించకపోయినా, యెందుకరుస్తున్నదో అర్థం కాక పోయినా యేదో జరిగిందనుకున్నాడు. పద్మ వ్యూహాన్ని ఛేదించుకొని ఆడవాళ్ల సీట్లవైపు రావడానికి ఘోర ప్రయత్నం చేస్తున్నాడు వీరయ్య. తన చుట్టూ నిలబడివున్న వాళ్ళ తలల మధ్య నుంచీ నిక్కి చూస్తూ "యేంటమ్మా, యేం జరిగింది?" అన్నాడు. చెన్నమ్మకు వాళ్ళ నాయన ప్రశ్న వినిపించింది. నవ్వుతూన్న ప్రయాణీకులనూ, తనకేసి చూస్తున్న రసికులనూ చెన్నమ్మ చూసింది. యేడుపు దిగమింగుకుంటూ అవమాన భారంతో పైటలాక్కుంటూ అంది.

"మనం యింతకు ముందు దిగిన్నామే, ఆ బస్సులో నా గుడ్డల మూటె - దాపుడుకోకున్న మూటె మర్చిపోయినా".

టికెట్లు వసూలు చేసుకుంటూ, బస్సులోని జనాన్ని సర్దుతూ ఆడవాళ్ళనూ మొరటు వాళ్ళను ఆదమాయిస్తూ అష్టావధానం చేస్తున్న కండక్టర్ చెన్నమ్మ అరుపులకు మండి పడ్డాడు. 'కూచో' అని కసిరాడు. అంతలో తంటాలు పడి అక్కడికి చీవాట్ల మధ్య వీరయ్య యీదుకుంటూ వచ్చాడు - గొర్రె పిల్లను రక్షించడానికి వచ్చిన గొర్ల కాపరిలాగా, వీరయ్యకు సంగతి అర్థమైంది. కండక్టరును బస్సు ఆపమన్నాడు. కండక్టరు కస్సుమని వొంటికాలి మీద లేచాడు.

"యేందయ్యా మీ గోల. వూరుదాటి మైలొచ్చేసినాం, బస్సు నిలపడమేంది? ఆ మూటేదో తెచ్చు కునేదాకా బస్సాపమంటావా? నీ పుణ్యాన వెనక్కి పోనిమ్మండ్లేదు. నీ కోసం బస్సు నిలబెట్టాల్నా? నువ్వేం డియస్పీవా? బ్రేకినిస్పెక్టరువా?"

కండక్టరు నిజం పలికినందుకు వీరయ్య విస్తుపోయాడు. వీరయ్య డియస్పీ కాదు; బ్రేకినిస్పెక్టరు అంతకన్నా కాదు. బస్సునూ, కండక్టరునూ చేసేదేం లేక కూతురును కసిరాడు.

"ఆ మాత్తరం జాగర్త అక్కర్లా? ఆ మూటెను యాడమర్చిపోయినావు? ఆ మూటెలో యేమున్నాయి?

"మానూర్నుంచి వచ్చిన బస్సులో మర్చిపోయినా, అంత గుంపు దోసుకొస్తుంటే దిక్కుతెల్లేదు నాయనా? వూపిరాడక పిల్లోడు యేడ్చినాడు. తొందరగా దిగడంలో మర్చిపోయినా. దిగి మళ్ళా ఆ బస్సులో యెదికితే దొరుకుతాదేమో?"

తండ్రి వైపూ, కండక్టరు వైపూ దీనాతిదీనంగా చూస్తూ, చుట్టూ వున్న వాళ్ళను సిగ్గుతో చూస్తూ చెన్నమ్మ సంజాయిషీ చెప్పింది.

"యే బస్సులో యేం?" కండక్టరు కరిచాడు.

"కడబ్బస్సులో" చెన్నమ్మ బెరుకుగా సమాధానమిచ్చింది.

"పెద్ద పెద్దయి మర్చిపోయినోళ్ళతో కూడా మా కిబ్బంది లేదు. మీరు మా దుంపదెంచుతారు - నానా రకాల మూటల్తోవచ్చి".

తనేమిటో మర్చిపోయి కండక్టరు విసుక్కునాడు. కండక్టరు విసుక్కోకపోవడానికి చెన్నమ్మ ఖరీదైనది కాదు. సానుభూతితో పరామర్శించడానికి చెన్నమ్మ అందమైనది కాదు. మర్యాదగా మాట్టాడానికి చెన్నమ్మ బస్సు వోనర్లతో సంబంధముండే యే అధికారి భార్య కాదు, బంధువూ కాదు, బస్సులోని వారెవరో సానుభూతి ప్రకటించారు.

"పోనీలే పాపం, బస్సు నిలబెట్టు, వాళ్ళు దిగుతారు. మూటె దొరుకుతుందేమో. అది నైటాల్టు బస్సే కదా? అక్కడే వుంటుంది".

వీరయ్య కొంతధైర్యం తెచ్చుకొని బ్రతిమాలాడు.

"నీకు పుణ్ణెముంటుంది. మా టికెట్టు డబ్బులు వెనక్కి యిచ్చి యిక్కడ దించు. మూటె దొరికితే యేరే బస్సులో వస్తాం".

"నీకేమన్నా మతిబోయిందా? టికెట్టు రాసినాం. బస్సు వూరు దాటి రెండు మైళ్లొచ్చింది. యిప్పుడు టికెట్టు డబ్బులడుగుతావా? యింకా పొద్దుటూరు చేరినాకా అడగలా? నీదేం బోయింది? యిట్లా అయితే మేమూ, మా వోనరూ దివాలా తీయాల్సిందే".

కండక్టరు స్వామి భక్తిని ప్రకటించాడు.

వీరయ్య ప్రాధేయ పడ్డాడు.

"మళ్ళా రావటానికి డబ్బుల్లేవు. నీకు పున్నెముంటుంది. యిక్కడే దించి డబ్బులీ, దిగిపోతాం బాబ్బాబూ".

"డబ్బుల్లేవు డబ్బులేవు యిదొక తంతయింది. నీకేం మా చెకింగు పట్టుకున్నాడంటె నా వుద్యోగం వూడ్తుంది. డబ్బు వాపసేమీ రాదు, కావాలంటే దిగండి".

కండక్టరు చీదరించాడు. వీరయ్య కూతురు వైపు నిస్సహాయంగా చూస్తూ అన్నాడు: "దిగితే మళ్లా సార్జీలకు లేదు. పోతే పోనీలే మన కరమ".

''నా దగ్గర మూడు రూపాయలుంది. సార్జీకి సరిపోతాది. దిగుదాం'', చెన్నమ్మ కండక్టరు వైపు భయంతో చూస్తూ అంది.

కండక్టరు ''దరిద్రపు రూట''ని వదురుకుంటూ ''హోల్డాన్'' అని కేక వేశాడు. బస్సు ఆగింది. వీరయ్యా, చెన్నమ్మ దిగారు, చంకలోంచి జారిపో తున్న కొడుకును పైకి లాక్కుంటూ త్వరత్వరగా అడుగులు వేస్తుంది చెన్నమ్మ, వీరయ్య దిగులుగా అనుసరిస్తున్నాడు.

నా కోక
దాపుడు కోక
ముప్పయి రూపాయల కోక
పేటలో కొనుక్కున్న కోక
కలుపు తీయటానికి పోయి
నిమ్మసెట్లలో పాదులు తొవ్వటానికి పోయి
కట్టపడి డబ్బు కూడబెట్టుకొని
కొనుక్కున్న కోక
తనకెంతో యిష్టమైన కోక
అరచేతి యెడల్పు నల్లంచు యెర్రకోక
మొగుడికి సానా యిష్టమైన కోక
యీకోక కట్టుకుంటే సినిమాల్లో సావిత్రిల్లా వుంటావని మొగుడంటే
రోజూ కట్టుకో బుద్దయ్యే కోక కానీ
వుతకలకు కట్టుకుంటే సిరిగిపోతుందని భయపడి
రోజూ కట్టుకోని కోక
పిల్లోడు పుట్నెప్పుడ్నించీ కట్టుకోని కోక
పిల్లోన్ని సంకలో యేసుకున్నప్పుడు వాడుచ్చులు పోస్తే పాడయితాదని కట్టు కోని కోక
నలుగురూ మెచ్చుకున్న కోక
తన దాపుడు కోక
కరమ యెవడన్నా యెత్తకపోయినాడేమో!
పుట్టింట్లో అందరికీ సూపియ్యాలనుకున్నానే
తిరిగి వూరికి పోయినప్పుడు మొగుడేమంటాడో!
పుట్టింట్లో సెల్లెలికిచ్చి వచ్చినావని అరుస్తాడేమో!
ఆ కోక లేకపోతే
సినిమాకు పోయేదెట్లా?
పండగల కెట్లా?
రామేశ్వరం తిర్నాలకెట్లా?
పెండ్లిండ్లకెట్లా?
నలుగుర్లో తిరిగేదెట్లా?
మళ్ళా కొత్తది కొనేదెట్లా?
ముప్పయి రూపాయల కట్టం



సీరెకోసం కట్టంలో
నిమ్మసెట్ల పాదులు తొలికెతో తొగీ తొగీ
సేతులు కాయలు కాసినాయి.

చెన్నమ్మ మనస్సు బాధతో నిండిపోయింది. దుఃఖం ముంచుకొచ్చింది. కళ్ళల్లో నీళ్ళు. కష్టం తెలిసిన కన్నీళ్ళు, పేదకోరిక కారుస్తున్న కన్నీళ్ళు.

''సోమీ! యేడుకొండలవాడా! నా దాపుడు కోక దొరికితే వొక్క పొద్దుండి టెంకాయ కొడతా'' అని చెన్నమ్మ మనసులో పరిపరి విధాల మొక్కుకుంది. వీరయ్యా, చెన్నమ్మా స్టాండు చేరారు.

''నాయనా! అదే బస్సు, మనం వూర్నించి వచ్చిన యెఱ్ఱ మూతి బస్సు''.

చెన్నమ్మకు కోక దొరికినంత ఆనందమయింది.

''పిల్లోంతో నువ్వేం బాధపడతావు గాని, అదిగో అక్కడుండు. నేను యెదికి తెస్తా''.

వీరయ్య చెన్నమ్మను వొక బంకు నీడలో వొక పక్కగా నిలబెట్టి బస్సు దగ్గరకు వెళ్లాడు. బస్సంతా వెతికాడు – సీటు సీటు పైనా కిందా. కన్పడలేదు. బస్సులో చెత్త వూడుస్తున్న కుఱ్రవాణ్ణి అడిగితే ''అట్లాంటి మూటే కనపళ్లేద''న్నాడు. బస్సు దగ్గర వున్న వొకరిద్దర్ని అడిగినా ప్రయోజనం లేక పోయింది. డ్రైవరునూ, కండక్టరునూ అడుగుదామనుకు న్నాడు. కానీ డ్రైవరు యింటికి పోయి నాడట, కండక్టరు కలెక్షను డబ్బులు వోనరు కివ్వటానికి పోయినాడట – బస్సు క్లీనరు చెప్పాడు. వీరయ్య హతాశుడై తిరిగివచ్చి కూతురును వోదార్చటానికి ప్రయత్నిస్తూ వేదాంతం చెప్పాడు.

''దొరకలా, యెంతెతికినా దొరకలా, యాడెతికినా దొరకలా, యెవర్నడిగినా దొరకలా, పొద్దున్నే యెవల్ల మొకం చూసి బయల్దేరినామో, మన కరమ, యేం సేస్తాం? యెవడో యెత్తకపోయినాడు– మనకంటే దరిద్దరం ముండా కొడుకు. అయినా మనలాంటోల్లు జాగర్తగా వుండాల. యేందన్నా పోగొట్టుకుంటే తిరిగి సంపాయించుకునే గతిలేదు. పోతేపోనీలే. వూరికి పోయినాక చూస్తాం''.

బస్సులో పడిన అవమానాన్ని తలచుకుంటూ, నడిచి వచ్చిన శ్రమను అనుభవిస్తూ , మరొక చీర – అట్లాంటి చీర – కొనలేని దరిద్రాన్ని తలపోసుకుంటూ, అల్లుడేమనుకో కుండా అట్లాంటిదే మరొక చీరను కొని కూతురు కిచ్చే వుపాయాన్ని ఆలోచిస్తూ వీరయ్య కూతురును వోదారుస్తున్నాడు. అంతలో వాళ్ళకు కొంచెం దూరంలో వొక తాగిన వాడు బండబూతులు తిడుతూ తూలుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు. వాడి చేతిలో యేదో యెఱ్ఱటి బట్ట. వాని వెంట మరొకడు తరుముతూ వస్తున్నాడు.

''వొరే యెదవ నాకొడకా, యాడకు బోతావురా, గొంతుదాకా వుద్దర సారాయి తాగదమను కున్నావా?''

సారాయి తాగినవాడి చేతిలో వున్న వస్తువును, లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నాడు. సారాయి తాగిన వాడు గట్టిగా పట్టుకున్నా, కొంత సడలి బట్ట అంచులు జారినాయి.

''నాయనా! అదిగో నా కోక, నాదే ఆ కోక, అదే నా దాపుడు కోక'

చెన్నమ్మ తండ్రితో బిగ్గరగా చెప్పి వాళ్ళ దగ్గరకు ఆదుర్దాతో పరుగెత్తుతోంది. వీరయ్య గాబరా పడుతూ వాళ్ళ దగ్గరకు చేరాడు.

వాళ్లింగా పెనుగులాడుతూనే వున్నారు. వొకరిద్దరు పోగయ్యారు. సారాయి తాగిన వానితో పెనుగులాడుతున్నవాడంటున్నాడు.

''రేయి నా దగ్గర టోకరా యేస్తావా? తాకట్టు పెట్టినట్టు పెట్టి పనికి రానివన్నీ నామీదేసి యీ కోక లాక్కొని పోతావా – నదురుగా వుందని. తాగిన పద్దరాములు సారాయైనా కక్కు, లేదా యీకోక నాకివ్వు. కోక యీరా దొంగనాకొడకా''.

''నాకోక, నాదే దాపుడు కోక, మిగతా పిల్లోడి గుడ్డలూ అయ్యియాడ్నో?'' చెన్నమ్మ దీనంగా గొణుగుతూంది.

వీరయ్య వాళ్ళ దగ్గరకు భయం భయంగా వెళ్ళి అన్నాడు.

''యీకోక మాయమ్మిది, బస్సులో మరిసిపోయింది''.

''అదే నేననుకుంటాండ, యీ నాకొడుక్కి కోకెక్కడిదీ అని. బస్సులో కొట్టేసి నాడన్న మాట! వొరేయి యిడవరా కోక''.

సారాయి తాగిన వాడు నంగి నంగిగా అన్నాడు?

''ర్రేయి నా సంగతి తెలీదా, యిడు. యిది నా కోక. నా పెండ్లాందిరా''.

యిద్దరూ గట్టిగా పెనుగులాడుతున్నారు. అరుపులు, తిట్లతో. వీరయ్యా చీరను విడిపించడానికి తానూ ప్రయత్నించాడు. పెనుగులాటలో చీర పర్రున చిరిగింది. చెన్నమ్మ యెఱ్ఱకోక, నల్లంచు యెఱ్ఱ దాపుడు కోక చిరిగి పీలికలైంది. రభస యింకా మొక్కువైంది. వాళ్ళు కొట్టుకుంటున్నారు. వీరయ్య చిరిగిన చీరవంక నిశ్చేష్టుడై చూస్తున్నాడు.

చెన్నమ్మ కలలకూ, ఆశలకూ, ప్రేమకూ, గర్వానికీ, ఆనందానికీ నిలయమైన దాపుడు కోకను, చెన్నమ్మ గుండెకు ప్రతిరూపమైన యెఱ్ఱ కోకను, వాళ్ళది కాని చెన్నమ్మ కోకను వాళ్ళు నిర్దాక్షిణ్యంగా చించిపారవేశారు. చెన్నమ్మ దాపుడు కోక పీలికలైంది.

''నా కోక, దాపుడు కోక'

చెన్నమ్మ కిందపడిన పీలికల్ని పట్టుకొని రోదిస్తోంది. చంకలో పసివాడు అమ్మ వెక్కిళ్ళకు శృతి పెడుతున్నాడు.

*(ఆంధ్రజ్యోతి – 3 మార్చి 1972)*

## కథాంతరంగం

నాకు నచ్చినకథ అంటే చెప్పలేను. అయితే రావి శాస్త్రి, పురాణం సుబ్రహ్మణ్య శర్మగార్లు బాగా ఇష్ట పడ్డ నా కథ 'దాపుడుకోక'. యిందులో నూటికి నూరుపాళ్లు నా అభిప్రాయాలు ప్రతిఫలించకపోయినా చాలా మంది మెచ్చుకున్న కథ ఇది. మాఊరు వెళ్లడానికి ఎర్రగుంట్లలో బస్సెక్కాను.



అదే బస్సులో మావూరి యాదవుల అమ్మాయి ఉంది. ఆమె తన చీరల మూటతో ఎక్కుతూండగా ఎవరో ఆ మూటను దొంగలించారు. ఆమె చాలా హృదయ విదారకంగా ఏడ్చింది. ఈ సంఘటన నన్ను సుమారు పాతికేళ్లు వెంటాడింది. దీనినే 1972లో కథగా రాశాను.

**– కేతు విశ్వనాథరెడ్డి, సెల్: *9866713647***

